



ప్రసాదంలోనూ.. గీ..కుడేనా!?

కిలో నెయ్యి అన్నవరంలో రూ.538.. సింహాచలంలో కిలో రూ.344

తిరుపతి దేవస్థానానికి సరఫరా అవుతున్న నెయ్యిలో చేప నూనె, జంతు కొవ్వు అవశేషాలు బయటపడి సంచలనం సృష్టిస్తోంది.. తిరుపతి ప్రసాదాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.. అటువంటిది అక్కడే కల్తీ జరిగిందంటే మిగిలిన ఆలయాల మాటేంటి ఇదీ ప్రతీ భక్తుడిని తొలుస్తున్న ప్రశ్న. మన జిల్లాలో అన్నవరం ప్రసాదానికి మహా డిమాండ్.. ప్రతి ఏటా లక్షలాది కిలోల నెయ్యి వినియోగిస్తారు. అటువంటిది అన్నవరం ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యిపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీసింది. దీంతో ఈ నెయ్యి బండారం బయటపడింది. ఒకే కంపెనీ అన్నవరం దేవస్థానానికి.. సింహాచలం దేవస్థానానికి నెయ్యి సరఫరా చేస్తోంది.. అన్నవరంలో కిలో నెయ్యికి రూ.538 వసూలు చేస్తుంటే.. అదే కంపెనీ సింహాచలంలో మాత్రం కిలో రూ.344 వసూలుచేయడం గమనార్హం. నేతలు, అధికారుల అండదండలతో కాంట్రాక్టరు గీకుడుకి అడ్డు లేకుండాపోయింది.

- ఒకే కంపెనీ.. ధరలో మాత్రం భారీ వ్యత్యాసం
- అన్నవరం దేవస్థానంలో నెయ్యి మాయాజాలం
- రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచి నెయ్యి కొనుగోలు
- నాలుగు సార్లు టెండర్లు.. ఒకే కంపెనీకి కాంట్రాక్టు
- గతంలో విజయ డెయిరీ నుంచి కొనుగోలు
- వైసీపీలో అనామక కంపెనీ నుంచే సరఫరా
- ఏటా 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరం
- రెండేళ్లలో రూ.7.76 కోట్ల నొక్కుడు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానానికి సరఫరా అవుతోన్న లక్షల కిలోల నెయ్యి మంచిదేనా..? లక్షలాది మంది భక్తులు ఇష్టంగా తినే ప్రసాదంలో పూర్తిగా నెయ్యి నాణ్యత పాటిస్తున్నారా..? ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యి గడచిన రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచే ఎందుకు వస్తోంది.. ఆరునెలలకోసారి టెండర్లు పిలుస్తుండగా.. ప్రతిసారీ అదే కంపెనీకి కాంట్రాక్టు ఎలా దక్కుతోంది.. అదే కంపెనీ సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తుంటే అన్నవరంలో మాత్రం కిలో రూ.538 ఎలా వసూలు చేస్తోంది. ఏటా దేవస్థానానికి 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరమైతే అంత భారీ నెయ్యి ఒక డీలర్ ఎలా సరఫరా చేయగలుగుతున్నాడు. మార్కెట్లో లభ్యమయ్యే నాణ్యమైన నెయ్యి ధరకు.. దేవస్థానానికి సరఫరా చేసే ధరకు ఇంత వ్యత్యాసం ఉంటే.. మరి ఆలయానికి వచ్చే నెయ్యిలో అంత నాణ్యత ఉంటుందా? ఇలా ఎన్నో సందేహాలు భక్తుల నుంచి ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యతపై అనుమానాలెన్నో..

వాస్తవానికి స్వచ్ఛమైన నాణ్యతతో కూడిన కిలో ఆవు నెయ్యి రూ.వెయ్యి వరకు పలుకుతోంది. ఆలయాలకు మాత్రం కాంట్రాక్టర్లు సగం ధరకే సరఫరా చేస్తుండడంతో నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కిలోల్లో సరఫరా కాబట్టి కాస్త బల్క్‌గా ధర తగ్గిందనుకున్నా ఏదో పేరొందిన డెయిరీలు మాత్రమే ఆ స్థాయిలో నెయ్యి సరఫరా చేయగలవు. అయితే వైసీపీ వచ్చిన తర్వాత వరుసగా రెండేళ్లపాటు ఒకే కంపెనీ నెయ్యి సరఫరా చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కంపెనీ తరపున ఓ డీలరు ఇంత భారీ నెయ్యిని ఎలా సరఫరా చేస్తున్నాడనే దానిపై అనుమానాలున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే రోజుకు దాదాపు 496 కిలోల నెయ్యి ఆలయానికి సరఫరా చేయడం అసాధ్యం. పైగా ఒక కిలో ఆవు నెయ్యి తయారవ్వాలంటే సరాసరి 30 లీటర్లకుపైగా పాలు అవసరం. మరి ఈ స్థాయిలో నెయ్యి తయారు చేసి సరఫరా చేయడం సాధారణ కాంట్రాక్టర్‌కు సాధ్యం కాదు. వేర్వేరు ప్రాంతాల నుంచి సేకరించి మిక్స్ చేసే అవకాశాలున్నాయి. దేవస్థానం ఈ నెయ్యి నాణ్యతను ఎంత వరకు సమర్థవంతంగా పరీక్షిస్తుందనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు నెయ్యి నాణ్యతను పరీక్షించాల్సి ఉండగా, వైసీపీ పెద్దల సిఫారసు చేసిన కాంట్రాక్టరు కావడంతో అధికారులు ఇదేదీ పెద్దగా పట్టించుకోవడం లేదు. తాజాగా తిరుపతి దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యి వివాదాస్పదమైన నేపథ్యంలో ఇక్కడకు సరఫరా అవుతోన్న నెయ్యిపై ఇక నుంచి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



2 కోట్ల ప్యాకెట్లు అమ్మకం..

అన్నవరం దేవస్థానం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రం. ఏటా లక్షలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఇక్కడకు వచ్చే ప్రతి భక్తుడు ఎంతో ఇష్టంగా అన్నవరం ప్రసాదాన్ని తింటారు. ఏటా రెండు కోట్ల వరకు ప్రసాదం ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఈ ప్రసాదం తయారీలో నెయ్యి కీలకమైనది. దీని నాణ్యతపైనే ప్రసాదం రుచి ఆధారపడి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకే కంపెనీ గడచిన రెండేళ్లుగా నెయ్యి సరఫరా చేస్తోంది. ఈ నెయ్యి ధరపై అనేక అనుమానాలు ఉన్నాయి.

రెండేళ్లు..4 టెండర్లు.. ఒకరికే..

అన్నవరం ఆలయానికి ఏటా 1.80 లక్షల నుంచి రెండు లక్షల కిలోల వరకు నెయ్యి అవసరం. ఈ నెయ్యి కొనుగోలు కోసం దేవస్థానం సెంట్రల్ స్టోర్స్ విభాగం ప్రతి ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తుంది. ఎవరు తక్కువ ధర కోట్ చేస్తే వారికే అప్పగిస్తుంది. 2022 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు టెండర్లు పిలవగా వరుసగా ఒకే కంపెనీ పేరుతో టెండర్‌లో పాల్గొంటున్న ఓ డీలర్‌కే ఈ కాంట్రాక్టు దక్కుతుండడం అనుమానాలకు తావిస్తోంది. సదరు కాంట్రాక్టర్ కోట్ చేసిన ధర ఇతర ఆలయాలకంటే ఎక్కువగా ఉన్నా అధికారులు ఇదేదీ పట్టించుకోలేదు. ఈమేరకు అధికారంలో ఉన్న సమయంలో కొందరు వైసీపీ పెద్దలు పావులు కదపడం విశేషం. గడచిన రెండేళ్లుగా సదరు డీలరు దేవస్థానానికి కిలో నెయ్యి 2022 అక్టోబరు నుంచి 2023 మార్చి వరకు కిలో రూ.498 చొప్పున, 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కిలో రూ.564 చొప్పున, 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రూ.540, 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.538.60 చొప్పున సరఫరా చేస్తున్నాడు. సింహాచలం దేవ స్థానానికి మాత్రం ఇదే కంపెనీ కిలో నెయ్యి రూ.344 చొప్పున సరఫరా చేస్తోంది. దీన్నిబట్టి అన్నవరం ఆలయానికి సరఫరా చేసే నెయ్యి ధరలో ఎంత పిండేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ధరతో పోల్చితే ఈ రెండేళ్లలో దేవస్థానానికి రూ.7.76 కోట్లు నష్టం వాటిల్లినట్టు లెక్క. తిరుపతిలాంటి దేవస్థానానికి కిలో నెయ్యి రూ.411కి సరఫరా కాగా ఇక్కడ మాత్రం ధరలో వ్యత్యాసం ఉండడం విశేషం. వాస్తవానికి జగన్ సర్కారు రాక ముందు అన్నవరం దేవ స్థానానికి సంగం, విజయలాంటి పేరొందిన డెయిరీల నుంచి నెయ్యి వచ్చేది. కమీషన్ల కక్కుర్తితో వైసీపీ 2022 నుంచీ ఊరు పేరు లేని కంపెనీని తెరపైకి తెచ్చి నెయ్యి సరఫరా చేయిస్తుండడం విశేషం.

హెల్మెట్ లేకపోతే.. అనుమతి లేదు!

- ద్విచక్రవాహనాలపై వచ్చే ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బందికి హెల్మెట్ తప్పనిసరి
- ఉమ్మడి జిల్లా నోడల్ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ద్విచక్ర వాహనాలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, సిబ్బంది హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, లేకపోతే కార్యాలయంలోకి అనుమతిలేదని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ప్రకటించారు. ఉమ్మడి జిల్లా నోడల్ కలెక్టర్‌గా ఆయన ఈ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాతోపాటు రంపచోడవరం నియోజకవర్గానికి కూడా వర్తించనున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణనష్టం తగ్గించడం కోసం ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధారణ తప్పనిసరి చేశారు. దీనిలోభాగంగా కలెక్టర్ ఈ ఆదేశాలు జారీ చేశారు.

పిఠాపురం ఎంఈవో సస్పెన్షన్

పిఠాపురం, సెప్టెంబరు 20: పిఠాపురం మండల విద్యాశాఖాధికారి ఆర్‌వీ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వరదలు, భారీ వర్షాల సమయంలో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టరు ఇచ్చిన ఆదేశాలు అమలుచేయకపోవడం, ఇతర విషయాల్లో వచ్చిన ఆరోపణల విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి విచారణ నిర్వహించి నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా ఎంఈవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్టు ఆర్‌జేడీ నాగమణి ధ్రువీకరించారు.

ఈదురుగాలులు.. భారీ వర్షం



కాకినాడలో కుండపోతగా కురుస్తున్న వాన



ప్రత్తిపాడులో వర్షం



- జిల్లావ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం
- ఈదురుగాలులకు విరిగిన స్తంభాలు
- ఉదయం ఉక్కపోత.. వర్షంతో చల్లదనం
- సేదతీరిన జనం.. లోతట్టు జలమయం

కాకినాడ సిటీ/కరప/పిఠాపురం/గొల్లప్రోలు/ప్రత్తిపాడు/తుని, సెప్టెంబరు20: జిల్లావ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతగా గుబులు పుట్టించిన వాతావరణం సాయంత్రానికి చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు సేద తీరారు. దీనికితోడు ఆకాశం కారుమబ్బులతో ఆహ్లాదకరంగా మారింది. కాకినాడ నగరంలోని డెయిరీఫారమ్, జగన్నాథపురం ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. కరప మండల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా భారీవర్షం పడింది. అప్పటికప్పుడు ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్ముకుని చల్లని గాలులు వీచాయి. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం చల్లని గాలులు, వర్షానికి ఒక్కసారిగా సేదదీరారు. జోరున కురిసిన వర్షానికి రోడ్లు, ప్రధాన వీధులు జలమయమయ్యాయి. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో శుక్రవా రం సాయంత్రం స్వల్పంగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మబ్బుగా ఉండి ప్రజలు ఉక్కపోత వాతావరణంతో సత మతమయ్యారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వర్షం పడింది. ప్రత్తిపాడులో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తునిలో శుక్రవారం మధ్యాహ్నం గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. మధ్యాహ్నం వరకు నిప్పులు కురిపించిన ఎండకు విలవిలలాడిన పట్టణవాసులు సాయంత్రం వర్షానికి ఉపశమనం పొందారు.



కాకినాడలో శుక్రవారం వర్షంలో వెళుతున్న విద్యార్థినులు

సుబ్బయ్యమ్మపేటలో ఈదురుగాలికి పడిన ట్రాన్స్‌ఫార్మర్

ఈదురుగాలుల బీభత్సం

విరిగిపడ్డ ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలు

గండేపల్లి, సెప్టెంబరు 20: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం గంటసేపు కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. దీంతో ఈదురుగాలులు సుడి గుండాలు తిప్పడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మల్లేపల్లి, సుబ్బయ్యమ్మ పేట, కె.గోపాలపురం వెళ్లే రోడ్డులో 11కేవీ ట్రాన్స్‌ఫారాలు కింద పడ్డాయి. దీంతో విద్యుత్ నిలిచిపోవడంతో గ్రామస్తులు, రైతులు ఇబ్బందులుపడ్డారు.

ప్రజల సలహాలు స్వీకరించేందుకే..

'ఇది మంచి ప్రభుత్వం'



ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్. పక్కన ఎమ్మెల్యే కొండబాబు

- ప్రజావేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్
- ఇది చేతల ప్రభుత్వం : ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం ప్రజాసమస్యలను తెలుసుకుంటూ వారి సలహాలను స్వీకరించేందుకే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గ్రామ, పట్టణ, నగరస్థాయిలో చేపట్టిందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక పర్లోవపేట ఏఎంజీ పాఠశాల ప్రాంగణంలో 9,10,11,12,13 డివిజన్ల ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ మనోహర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈ ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వంద రోజులే కాదు.. రాబోయే రోజుల్లో కూడా ప్రభుత్వం ఏం చేస్తే బాగుంటుందనే సలహాలను ప్రజల నుంచి స్వీకరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సిటీ ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఈ వంద రోజుల పాలనలోనే రుజువైందని పేర్కొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా పెన్షన్ సొమ్ము పెంపు, అన్న క్యాంటీన్ల ప్రారంభం, డీఎస్సీ నోటిఫికేషన్ వంటి పథకాలను అమలుచేసిందన్నారు. ప్రజలు కూడా 'ఇది మంచి ప్రభుత్వం' అని సంతోషంగా చెబుతున్నారన్నారు. ఈ సందర్భంగా వంద రోజుల పాలన స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ ఏసుబాబు, టీపీఆర్వో శైలజ, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, బీజేపీ నగర అధ్యక్షుడు గట్టి సత్యనారాయణ, మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, నాయకులు తుమ్మల సునీత రమేష్, వొమ్మి బాలాజీ, ఎంఎ తాజుద్దీన్, గదుల సాయిబాబు, మోసా పేతూరు, చోడిపల్లి సతీష్, ఎరుపల్లి రాము, తుమ్మల కొండలరావు, కసింకోట చంద్రశేఖర్, గాది శివరామకృష్ణ, వాసంశెట్టి చిట్టప్ప, ఇతర విభాగాల అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కరప సొసైటీపై ఆరోపణలు

కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుకు రైతుల సమాయత్తం



కరప, సెప్టెంబరు 20: ఒకప్పుడు ఎంతో ఆదర్శవంతంగా నిలిచిన కరప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయం నేడు పలు ఆరోపణలకు వేదికగా మారింది. సొసైటీలో పలు అక్రమాలు జరిగాయని, ఇవన్నీ సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదని సంఘ సభ్యులైన పలువురు రైతులు ఆరోపణాస్త్రాలను సంధిస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారులు వెంటనే స్పందించి ఈ అక్రమాల నిగ్గుతేల్చాలని రైతులు పట్టుబడుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి వరుసగా మూడేళ్లు సంఘం తరపున ఐటీ రిటర్న్ దాఖలు చేయలేదు. దీంతో 19-20 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ టర్నోవర్‌గా చూపిన రూ.4 కోట్లపై 20శాతం టాక్స్ అంటే రూ.80 లక్షలు కట్టాలని ఐటీ అధికారులు గతేడాది ఆగస్టులో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌కు నోటీసులు పంపారు. అప్పటివరకు వ్యాపార లావాదేవీలు నిలిపేయాల్సిందిగా నోటీసులో పొందుపర్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పటి కరప డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ సొసైటీ కార్యాలయానికి తాళాలు వేసి కరెంట్, ఎస్‌బీ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. సంఘ ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోవడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో కళ్లు తెరిచిన సంఘ సిబ్బంది ఐటీ అధికారుల సూచన మేరకు సొసైటీ షేరుధనం నుంచి రెండు దఫాలుగా రూ.10 లక్షలు కట్టి అప్పీల్‌కు వెళ్లారు. దీంతో సొసైటీ కరెంట్, ఎస్‌బీ ఖాతాలను పునరుద్ధరించడంతో అప్పట్నించి కార్యకలాపాలు యథావిధిగా జరుగుతున్నాయి. ఇక కరప సొసైటీ పరిధిలో 1,400 మంది రైతులు ఉండగా వారిలో పలువురు రైతులు తీసుకున్న రుణాలకు సకాలంలో వాయిదాలు తిరిగి చెల్లించలేదు. వాయిదా మీరిన రుణాలను పెరిగిన వడ్డీరేటు ప్రకారం కట్టాలంటూ సంఘ సిబ్బంది తాజాగా రిజిస్టర్ పోస్టులో నోటీసులు పంపడం వివాదాస్పదమైంది. దీనిపై నోటీసులు అందుకున్న పలువురు రైతులు సొసైటీకి వెళ్లి కార్యదర్శిని నిలదీశారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నోటీసులు ఎలా పంపారని, రుణం తీసుకున్నప్పుడు తెలిపిన వడ్డీరేటు ప్రకారం కాకుండా పెరిగిన వడ్డీరేటుపై బకాయిలు చెల్లించాలని చెప్పడం దారుణమని రైతులు అభ్యంతరం వ్యక్తంచేశారు. అదేవిధంగా సొసైటీ మొదటి అంతస్తు నిర్మాణంలో పలు అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. చేసిన పనికి బిల్లులు లేకపోవడం, అక్కడ జరిగిన పనులకు, డ్రా చేసిన సొమ్ములకు పొంతన లేకపోవడం, ఎంబుక్‌లో వివరాలు లోపభూయిష్టంగా ఉండడం తదితర కారణాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. జరిగిన అవకతవకలపై సమాధానం చెప్పాలంటూ శుక్రవారం రైతులు భేరి రామకృష్ణ, గోన శ్రీనివాస్, గొర్రెల వెంకన్న, అప్పాపంతుల భద్రం, గొర్రెల కామేశ్వరరావు, భేరి సుబ్బరాజు తదితరులు సొసైటీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శిని నిలదీశారు. కార్యాలయం భవనం చుట్టూ ప్రహరీగోడగానీ, పై అంతస్తు నిర్మాణాలుగానీ తన హయాంలో జరగలేదని, ఆ నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి బిల్లులు తమవద్ద లేవని సంఘ కార్యదర్శి పి.వెంకటరమణ తెలిపారు. ఇప్పటికీ తనకు ఎవరూ చార్జ్ అప్పజెప్పలేదని ఆయన తెలియజేశారు. ఇక ముందస్తు డిమాండు నోటీస్ ఇవ్వకుండా బకాయి నోటీసులు పొరబాటున జారీచేశామని ఆయన వివరణ ఇచ్చారు.

అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈవోగా రామచంద్ర మోహన్

కాకినాడ, కోనసీమ జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా మురళీమోహన్ బాధ్యతల స్వీకారం 8వ పేజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, అటవీ అధికారిణి భరణి

అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల సరిహద్దులను గుర్తించాలి : జిల్లా కలెక్టర్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20: జిల్లాలో అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల సరిహద్దులను గుర్తించేందుకు రెవెన్యూ, అటవీ, సర్వేశాఖ ఉమ్మడి తనిఖీచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారిణి ఎస్ భరణి, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు. అటవీ సరిహద్దులను గుర్తించేందుకు సర్వే నిర్వహించడం, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, మడ అడవుల్లో సారా తయారీ, అక్రమ మద్యం రవాణా నివారణ అంశాలపై కలెక్టర్ చర్చించారు. సమావేశంలో ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే సీతారామారావు, సబ్‌డివిజనల్ ఫారెస్ట్ అధికారి అనూష, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి ఎ.చంద్రమౌళీశ్వరి, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ బి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా కొనసాగించాలి : కలెక్టర్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20 : అల్ట్రాసౌండ్ స్కానింగ్ ప్రక్రియను గర్భస్థ పిండలింగ నిర్ధారణలకోసం దుర్వినియోగం కాకుండా నివారించేందుకు జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా, నిశితమైన పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టు హాల్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, వెల్లడి నిషేధ చట్టం, ఏఆర్టీ అండ్ సరోగసీ యాక్ట్‌ల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పరిశీలన, సంరక్షణ కోసం నిర్దేశించిన అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షా విధానం పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయడం చట్టప్రకారం శిక్షార్హమైన నేరమన్నారు. దీన్ని నిషేధిస్తూ చేసిన చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కే శ్రీలక్ష్మి, డీఎఫ్‌వో ఎస్ భరణి, డీఎంహెచ్‌వో జే నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేపీ సరిత, ఇన్‌చార్జి డీఐవో ఆర్ శ్రీనివాసనాయక్, డెమో రాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



నీలి మేఘం శ్రీఆంజనేయం

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆకాశాన్ని నీలి మేఘాలు కమ్మేశాయి. ఆ మేఘాల ముందు అభయమిస్తున్నట్టుగా దర్శనమిచ్చారు ఆంజనేయస్వామి. ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. - కాకినాడ

అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈవోగా
రామచంద్రమోహన్

అన్నవరం, సెప్టెంబరు 20: అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈవోగా కె.రామచంద్రమోహన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్క్ అరేంజ్‌మెంట్‌లో భాగంగా గతంలో చంద్రశేఖర్ ఆజాద్ అన్నవరం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆజాద్‌ను రెండు రోజుల క్రితం చిత్తూరు ఆర్‌జేసీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఖాళీ అయిన స్థానంలో ప్రస్తుతం అన్నవరం ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు రెగ్యులర్ ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా
మురళీమోహన్ బాధ్యతల స్వీకారం



కాకినాడ క్రైం, సెప్టెంబరు 20: కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా సుంకర మురళీమోహన్ కాకినాడ వైద్య నగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన ఏసీబీ సీఐగా పని చేశారు. అనంతరం కాకినాడ ఎస్‌బీ డీఎస్పీగా, దిశా డీఎస్పీగా పని చేశారు. తదుపరి పెద్దాపురం ఇన్‌చార్జి డీఎస్పీగా పనిచేసిన ఆయన ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లి తిరిగి కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన దుర్గారావు విజయవాడ పటమట డీఎస్పీగా బదిలీ అయ్యారు.





యువజనోత్సవాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- మహిళలకు సముచిత స్థానం కల్పించాలి
- రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
- నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన యువజనోత్సవాలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20: దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడంలో యువత కీలక బాధ్యతలు స్వీకరించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువులోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కన్వెన్షన్‌లో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో యువజనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో యువశక్తి ఆస్తిగా ఉన్న దేశం భారత్ అన్నారు. నేడు ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదిగిన దేశాలు వృద్ధాప్య ఛాయలను కలిగి ఉండగా... భారతదేశం ఒక్కటే భవిష్యత్ అభివృద్ధికి కొలమానంగా ఉందన్నారు. దేశ జనాభాలో 50శాతం పైగా ఉన్న మహిళలను ప్రోత్సహించి వారికి సముచిత స్థానం కల్పించాల్సి ఉందని, కొంత మంది మహిళలు రక్తహీనత, ఎనీమియా, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. విశిష్ట అతిథి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యువతలో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విజ్ఞతతో సద్వినియోగం చేసుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో వాటి ద్వారా ఒనగూరే ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకుని రావడంలో యువత పాత్ర కీలకమన్నారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ముఖ్య భూమిక వహించాలని కోరారు. యువజన సర్వీసుల శాఖ కమిషనరు పి.శారదాదేవి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలకు రాష్ట్రస్థాయికి ఎంపిక వుతారన్నారు. అక్కడి నుంచి జాతీయ స్థాయికి పంపిస్తారన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో అతిథులు ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, సెట్రాజ్ కాకినాడ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యువజనోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి



శిక్షణ ఇస్తున్న పీడీజే సునీత

పారా లీగల్ వలంటీర్లకు
ప్రత్యేక శిక్షణ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి న్యాయ సేవలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించడం ఈ శిక్షణ ఉద్దేశమన్నారు. ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థలకు పీఎల్‌వీలు వారధులుగా వ్యవహరించాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రీదేవి, న్యాయవాది పి.శ్రీనివాసరావు, ఏసీఎల్‌లు ఎస్‌కే జబీన, ఎం.లలిత కుమారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేశ్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎం ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విలియం పలు చట్టాలు, అంశాలను వివరించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (పాత చిత్రం)

అంబాజీపేట, సెప్టెంబరు 20: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక చెల్లు వెంకన్న (56) నివాసం ఉంటున్నాడు. ఇక్కడ తాపీ పనులు సరిగ్గా లేకపోవడంతో రెండు వారాల క్రితం హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లి వచ్చాడు. అప్పుల బాధలు ఎక్కువ కావడంతో తన సమీప బంధువునకు స్థలాన్ని విక్రయించాడు. అడ్వాన్సుగా కొంత మొత్తాన్ని తీసుకున్నాడు. ఈ నెల 19వ తేదీన ఇంటి బయట పడుకుంటానని భార్య నాగమణికి చెప్పాడు. ఉదయం చూసేసరికి సమీపంలోని ఓ పాకలో ఉరివేసుకుని ఉండడాన్ని గమనించి స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి అన్న కుమారుడు చెల్లు వెంకటదుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

బాణసంచా పేలుడు ఘటనలో మహిళ మృతి

అమలాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని రావులచెరువులో ఇటీవల జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన గొవ్వాల సుబ్బలక్ష్మి (60) కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. సుబ్బలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పేలుడు ఘటనలో గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగిలిన క్షతగాత్రులను ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శుక్రవారం పరామర్శించారు. బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప, జాతీయ స్థాయి క్రీడాకారుడు రాంబాబును సత్కరిస్తున్న చినరాజప్ప, విజయ్‌ప్రకాష్, రాజా సూరిబాబురాజు

క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
- శ్రీప్రకాష్‌లో ప్రారంభమైన సీబీఎస్ఈ క్లస్టర్-7 టీటీ పోటీలు
- 350 మంది క్రీడాకారుల హాజరు


పెద్దాపురం, సెప్టెంబరు 20: విద్యార్థులు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. కాకినాడ జిల్లా పెద్దాపురం రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడలకు ఈ అకాడమీ ద్వారా మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులు తయారు కావాలని ఆకాంక్షించారు. అత్యాధునిక సదుపాయాలతో అన్ని హంగులతో పూర్తిస్థాయి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన టేబుల్ టెన్నిస్ అకాడమీలో క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. ఇటువంటి క్రీడలకు శ్రీప్రకాష్ వేదిక కావడం సంతోషదాయకమన్నారు.. ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్ మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో ఇటువంటి టేబుల్ టెన్నిస్ అకాడమీ ఇక్కడ రూపుదిద్దుకోవడం గర్వకారణమన్నారు. పాఠశాల డైరెక్టర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు తమ పాఠశాల వేదిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 350 క్రీడాకారులు హాజరుకానున్నట్టు చెప్పారు. అనంతరం పదకొండుసార్లు బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారుడు కుమిలి రాంబాబును ఘనంగా సత్కరించారు. పోటీలకు రిఫరీలుగా రమణకుమార్, వేణు వ్యవహరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు పాల్గొన్నారు.

సొమ్మొకరిది... సోకొకరిది...

- అధికారుల వినోదం కోసం ఐటీడీఏ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- గిరిజన ప్రయోజనాలను విస్మరించి రూ.10 లక్షల నిధుల దుర్వినియోగం







రంపచోడవరంలో గోదామును ఇండోర్ స్టేడియంగా మార్చిన దృశ్యం

రంపచోడవరం, సెప్టెంబరు 20: గిరిజనుల అభివృద్ధికి మాత్రమే వినియోగించాల్సిన రంపచోడవరం ఐటీడీఏ నిధులను జగన్ పాలనలో ఉన్నతాధికారులు తమ వినోదం కోసం దుర్వినియోగం చేశారు. రంపచోడవరంలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టును ఐటీడీఏ నిధులతో ఇక్కడి ఉన్నతాధికారులు ఏర్పాటు చేసుకున్నారు. ఎటువంటి అనుమతి, ఆమోదం లేకుండానే... ముఖ్యంగా ఐటీడీఏ పాలకవర్గ తీర్మానం కూడా లేకుండా ఈ ఇండోర్ కోర్టుకు సుమారు రూ.10లక్షలు వెచ్చించినట్టు తెలిసింది. ఐటీడీఏ, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల ఉన్నతాధికారుల వినోదం కోసమే దీనిని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు తీర్చిదిద్దారు. ఆ అధికారులు ఇక్కడ రిలాక్స్ అవడం కోసం దీనిని ఏర్పాటు చేసుకున్నారన్న విమర్శలున్నాయి. రంపచోడవరంలో ఐటీడీఏ ఆధీనంలోని గోదామును ఉన్నతాధికారుల ఆనందం కోసం గిరిజన సంక్షేమ ఇంజనీర్లు ఇండోర్ షటిల్ కోర్టుగా మార్చారు. గిరిజనులకు ఉపయోగించాల్సిన నిధుల నుంచి రూ.10లక్షలను ఇందుకు వాడడం వివాదాస్పదమైంది. ఉన్నతాధికారులు రాత్రివేళల్లో ఈ ఇండోర్ స్టేడియాన్ని వినియోగించుకుంటున్నారు. మిగిలిన సమయాల్లో కమర్షియల్ స్టేడియంగా నెలకు రూ.4వేలు వసూలు చేసే వ్యవస్థగా మార్చి కొందరు ఉద్యోగులు, ప్రముఖులను కూడా చేర్చుకున్నారు. ఉన్నతాధికారులు అక్కడ ఉన్న సమయాల్లో సెక్యూరిటీ కారణాలతో ఎవర్నీ అటువైపుగా రానిచ్చేవారు కాదు. అందుకు వారు పహారా కూడా ఏర్పాటు చేసుకునేవారన్న విమర్శలూ ఉన్నాయి.



జైలులో పండించిన కూరగాయలు, మహిళా ఖైదీలు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మి

ఆశ్రమాన్ని తలపిస్తున్న మహిళా జైలు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి కితాబు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారం ఆశ్రమాన్ని తలపిస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి కితాబిచ్చారు. శుక్రవారం ఆమె జైలును పూర్తిగా పరిశీలించారు. బ్యారక్‌లు, వంటశాల, బేకరీ, పాఠశాల, గ్రంథాలయంతో పాటు ఆరు బయట జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు ఆరా తీశారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మహిళా ఖైదీలు తయారు చేస్తున్న బ్రెడ్, బిస్కట్లు, ఇతర ఆహార పదార్థాలను రుచి చూసి ప్రశంసించారు. జైలు ఆవరణలో మొక్కలు నాటారు. స్త్రీ సంబంధిత వ్యాధులు, పిల్లల వైద్య నిపుణులను రప్పించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అర్జీలు స్వీకరించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, జైలు పర్యవేక్షణాధికారి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో గైనిక్ సంబంధిత ఆంకాలజీ స్ర్కీనింగ్ పరీక్షలు

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 20: మహిళల్లో గర్భసంచి ముఖద్వార క్యాన్సర్‌కి సంబంధించి కాకినాడ జీజీహెచ్ గైనిక్ విభాగంలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఉచిత స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో గైనకాలజీ ఓపీడీ, ఎస్‌ఆర్‌ఎంటీ విభాగంలో క్యాంప్ నిర్వహిస్తారన్నారు. 35ఏళ్ల వయసు దాటిన మహిళలంతా ఈ పరీక్షల్లో పాల్గొనవచ్చన్నారు. దేశ, విదేశాల నుంచి ఆంకాలజీ వైద్య నిపుణులు రానున్నారని వెల్లడించారు. ఈ స్ర్కీనింగ్ పరీక్షల్లో పాల్గొనదలచిన మహిళలు ముందుగా గైనిక్ విభాగానికి వచ్చి తమ పేరు, ఫోన్ నెంబరు తెలియపర్చాలన్నారు. అనంతరం నాలుగు రోజుల క్యాంప్‌లో ఎవరెవరికి ఏ సమయం కేటాయించాలనేది నిర్ణయించి తెలియపరుస్తామన్నారు. వారంలో రెండు రోజుల పాటు రొమ్ము, గర్భసంచి ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్‌లకు స్ర్కీనింగ్ నిర్వహించనున్నట్టు ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ పాఠ్యాంశంగా
'ఈ పొలం అమ్మబడును'
యానాం రచయిత పెనుమాక రత్నాకర్ కథకి దక్కిన గౌరవం



యానాం, సెప్టెంబరు 20: యానాంకు చెందిన ప్రముఖ రచయిత రత్నాకర్ పెనుమాక రచించిన కథను ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్ డిగ్రీ మూడో సెమిస్టర్ పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరులో పెనుమాక విజయకుమార్-మేరీరోజ్ హైమావతి దంపతులకు జన్మించిన రత్నాకర్ యానాంలో స్వచ్ఛంద సేవా సంస్థ నెలకొల్పి 2005 నుంచీ సామాజిక సేవ చేస్తున్నారు. ఇప్పటివరకు 60 కథలు, 5 నవలు, 30 కవితలు రాశారు. 2022లో 'గౌతమి తీరం' పేరుతో మొదటి సంపుటి ఆవిష్కరించారు. ఇప్పటి వరకు 24 కథా బహుమతులు పొందారు. ఈ మధ్య 'ఉష' పత్రిక నిర్వహించిన ప్రపంచ స్థాయి కథల పోటీల్లో ప్రథమ బహుమతి పొందారు. ఆ కథపై అన్ని సాహిత్య వేదికల్లో చర్చ జరిగింది. కథా సాహిత్యంలో నిలిచిపోయే కథగా ప్రశంసలందుకుంది. సహరి పత్రికలో ప్రథమ బహుమతి పొందిన 'ఈ పొలం అమ్మబడును' అనే కథను డిగ్రీ మూడో సెమిస్టర్లో పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఇప్పటివరకు డిగ్రీ మొదటి, రెండు సెమిస్టర్ వారికి మాత్రమే రెండో భాష సబ్జెక్టుగా ఉండేది. ఈ విద్యా సంవత్సరం నుంచి మూడవ సెమిస్టర్ వారికి తెలుగు భాషను రెండో భాషా సబ్జెక్టుగా ప్రారంభిస్తున్నారు. అందులో కథా సాహిత్యంగా రాచకొండ విశ్వనాథశాస్త్రి లాంటి లబ్ధ ప్రతిష్టులైన కథలతో పాటు రత్నాకర్ కథను కూడా ఎంపిక చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని డిగ్రీ కళాశాలల్లో అమలు కానుందని, ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చినట్టు రత్నాకర్ తెలిపారు. ఇప్పటివరకు జీవించి ఉన్న ఏ కథకుడు (దళిత వర్గానికి చెందిన) కథను ఎంపిక చేయలేదు. ఇంతకు ముందు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి కొలకలూరి ఇనాక్‌కు చెందిన 'ఆకలి కథ' పాఠ్యాంశంగా ఉందని.. ఇప్పుడు డిగ్రీ స్థాయిలో ఇదే ప్రథమమని తెలుస్తోంది. ఇది యానాం దళితవర్గానికి దక్కిన అరుదైన గౌరవమని పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఈ ఘనత సాధించిన రత్నాకర్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, 'కళైమామణి' పొనుగుమట్ల విష్ణుమూర్తి, ప్రముఖ రచయిత 'కళైమామణి' దాట్ల దేవదానంరాజు అభినందనలు తెలిపారు..



నూతన యూనిట్ ప్రారంభం సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో
ఉపాధి కల్పన దిశగా పయనం

- దేవీ ఫిషరీస్ ఎండీ యార్లగడ్డ వీర్రాజు
- నూతన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

కాకినాడ సిటీ/జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 20: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన దిశగా తాము చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించడం వల్ల మంచి ఫలితాలు సాధించగలుగుతున్నామని దేవీ ఫిషరీస్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజు అన్నారు. కాకినాడలోని కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగ్గంపేట మండలం సీతానగరంలో నూతనంగా నెలకొల్పిన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం ఢిల్లీలో జరిగిన వరల్డ్ ఫుడ్ ఇండియా-2024 ఫెస్టివల్ వేదికగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, రవ్‌నీత్‌సింగ్ బిట్టు వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 2వేల మందికి, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో యూనిట్లు నెలకొల్పుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శేషుమాధవ్

పొగాకు రైతులు అవగాహనతో
అధిక దిగుబడులు సాధించాలి
సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 20: పొగాకు రైతులు పూర్తి అవగాహనతో అధిక దిగుబడులు సాధించవచ్చని సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరాలో శుక్రవారం సీటీఆర్ఐ శాస్త్రవేత్తలతో ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పొగాకు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శేషుమాధవ్ పొగాకు పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను క్లుప్తంగా వివరించారు. రైతులు పూర్తి స్థాయిలో అవగాహనతో అధునాతన పద్ధతుల్లో పొగాకు పంట వేసుకోవాలన్నారు. రైతుల అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. సీనియర్ శాస్త్రవేత్త పూర్ణబిందు పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. 15 నుంచి 20శాతం అధిక దిగుబడి సాధించడానికి ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టాక్ నూర్ గ్రాన్యూల్ ఎయిర్ షీల్డ్, కస్టమైజ్డ్ ఫెర్టిలైజర్స్ వాడాలన్నారు. సదస్సులో ఫెర్టిస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కేవీ గోపాల్‌రాజు, గోపాల్‌రెడ్డి, జయబాల, ఆర్.కృష్ణకుమార్, శరత్‌బాబు, బాజీ హుస్సేన్, అవినాష్ తేజ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తిట్టారని
అలిగి రైలెక్కిన బాలికలు
నిడదవోలులో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన రైల్వే హెడ్ కానిస్టేబుల్



నిడదవోలు, సెప్టెంబరు 20: ఇంట్లో తల్లిదండ్రులు తిట్టారని అలిగిన సుమారు 10 సంవత్సరాల వయసు గల ఇద్దరు బాలికలు ట్రైన్ ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. వారిద్దరూ గురువారం సాయంత్రం నిడదవోలు రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా రైల్వే హెడ్ కానిస్టేబుల్‌కు అనుమానం వచ్చి ఆరా తీశారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో చోటు చేసు కున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... తల్లిదండ్రులు మందలించారనే కోపంతో అనపర్తికి చెందిన రాచూరి మేరీ, మాణిక్యాల గోదగులమ్మ గురువారం రైలు ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. ప్లాట్ ఫామ్‌పై సంచరిస్తున్న వారి వివరాలను విధి నిర్వహణలో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలుసుకుని అనపర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం బాలికల తల్లిదండ్రులు నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బాలికలిద్దరినీ తల్లిదండ్రులకు అప్పగించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
● జిల్లావ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు

'ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి'

పిఠాపురం, సెప్టెంబరు 20: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు సూచించారు. కళాశాలఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆయన మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.కాశీవిశ్వనాథం, వి.బుల్లిప్రసాద్, ఎం.సుందరయ్య, మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో అన్నక్యాంటీన్ ప్రారంభం

ఏలేశ్వరం, సెప్టెంబరు 20: రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చేందుకు పట్టెడు అన్నం పెట్టాలన్న ఆలోచనతోనే సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పట్టణంలో శుక్రవారం మార్కెట్‌లో అన్నక్యాంటీన్ ప్రారంభించి పేదలకు ఆహారాన్ని స్వయంగా అందించారు. ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, కోట్ల కృష్ణ, గట్టెం వెంకటరమణ, ఇన్‌చార్జ్ కమిషనర్ అనూషలక్ష్మి పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, సెప్టెంబరు 20: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కేజీబీవీ విద్యార్థినికి జిల్లా ప్రథమస్థానం


పల్లవి

తొండంగి,సెప్టెంబరు20:స్వచ్ఛతహిసేవలో భాగంగా జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో వాకదారిపేట కేజీబీవీ విద్యార్థిని దూడ పల్లవి ప్రథమస్థానాన్ని గెలుచుకుంది. స్వచ్ఛసంకల్పం-నా ఆలోచనలుఅనే అంశంపై శుక్రవారం నిర్వహించిన పోటీలో ఆమె జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందని ప్రత్యేకాధికారి రాజేశ్వరి తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో కరప విద్యార్థుల ప్రతిభ


అఖిల్‌కుమార్


మహాలక్ష్మి

కరప, సెప్టెంబరు 20: జిల్లాస్థాయి వక్తృత్వ వ్యాసరచన పోటీల్లో కరప మండల విద్యార్థులు సత్తా చాటి ప్రథమ, తృతీయస్థానాల్లో నిలిచినట్టు ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ తెలిపారు. స్వచ్ఛతహి సేవాలో భాగంగా కాకినాడలో శుక్రవారం జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. కరప మండలం అరట్లకట్ట హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి కె.అఖిల్‌కుమార్ వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం, వ్యాసరచన పోటీల్లో వేళంగి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని ఎం.మహాలక్ష్మి తృతీయస్థానంలో నిలిచారన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలకు ఎంపిక


మహాలక్ష్మి

గండేపల్లి, సెప్టెంబరు 20: జిల్లాస్థాయి చెస్ పోటీలకు గండేపల్లి మండలం మల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని అనుకుల సింగార మహాలక్ష్మి ఎంపికైనట్లు హెచ్ఎం సుధామాధురి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-14 చెస్ విభాగంలో మండలస్థాయి, నియోజకవర్గస్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిందన్నారు.

అక్కూ పీజీ క్యాంపస్‌లో స్వభావ స్వచ్ఛత కార్యక్రమం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 20: తిమ్మాపురం అక్కూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, అధ్యాపకులు గోపి, మణికంఠేశ్వర్, హేమలత పాల్గొన్నారు.

ఆదిత్యలో స్వచ్ఛత ప్రతిజ్ఞ

గండేపల్లి, సెప్టెంబరు 20: సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో స్వచ్ఛత హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా ఆదిత్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనితీరు


పెద్దాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప


కిర్లంపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల


తాళ్లరేవులో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


కాకినాడ రూరల్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పంతం నానాజీ

పెద్దాపురం, సెప్టెంబరు 20: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులు పూర్తయిన సందర్భంగా మండలం లోని వడ్లమూరులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలసి ఆయన శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం చినరాజప్ప మాట్లాడుతూ 40ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బొల్ల వెంకటరమణ, బీజేపీ ఇన్‌చార్జ్ విత్తనాల వెంకటరమణ, ఎంపీపీ పెంకే సత్యవతి, టీడీపీ మండలఅధ్యక్షుడు కొత్తెం వెంకటశ్రీనివాసరావు, కందుల విశ్వేశ్వరరావు తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, ఎంపీడీవో అశోకకుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన ప్రగతిపై రూపొందించిన 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆవిష్కరించారు. డెయిరీఫారమ్ ఏరియాలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందించామన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, మాజీ కార్పొరేటర్లు తుమ్మల సునీత, వొమ్మి బాలాజీ, మోసా పేతూరు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం: ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా 100రోజుల పాలనలో ప్రజలకు ఎన్నోమంచి కార్యక్రమాలను చేసిందని ఎమ్మెల్యేదాట్ల బుచ్చిబాబు అన్నారు. శుక్రవారం జార్జీపేటలో ఆయన ఇంటింటా తిరిగి 100రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ గుత్తుల సత్యవేణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ప్రోగ్రాం ప్రత్యేకాధికారి విజయశాంతి, ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, కూనపురెడ్డి కామేశ్వరరావు, కట్టా త్రిమూర్తులు, పెదపాటి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో నేటినుంచి 'మంచి ప్రభుత్వం' షెడ్యూల్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 20: ప్రత్తిపాడులో శనివారం నుంచి వచ్చే శుక్రవారం వరకు నిర్వహించే ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక ఎమ్మెల్యే షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 21న శనివారం ప్రత్తిపాడు మండలంలో గజ్జెనపూడి, 22న ఏలేశ్వరం మండలం యర్రవరం, 23న శంఖవరం మండలం పెదమల్లాపురం, 24న ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం, 25న రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం, 26న శంఖవరం మండలం మండలం, 27న ఏలేశ్వరంలోని 8వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సత్యప్రభ కార్యాలయ వర్గం తెలిపింది.

తొండంగిలో..

తొండంగి, సెప్టెంబరు 20: మండలంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ తొండంగి, పైడికొండ, కోదాడల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బంటుపల్లి అన్వేష్, నేమాల కృష్ణమూర్తి సింహాచలం పాల్గొన్నారు.

తునిలో..

తుని రూరల్, సెప్టెంబరు 20: ఇది మంచి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత చింతమనేడి నాగ సోమరాజు(అబ్బాయి)స్పష్టం చేశారు. వంద రోజుల పాలనలో ప్రజలు మెచ్చిన కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలను వివరిస్తూ గడపగడపకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. లోవకొత్తూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, కుమ్మరిలోవలో జక్కన్న నామనాయుడు, డి.పోలవరంలో పలకా సుమేశ్వరరావు, తేటకుంట్లో గజ్జి అప్పలరాజు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో..

కిర్లంపూడి, సెప్టెంబర్ 20: కొత్త బస్సులు కొనుగోలుకు కేబినేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడిలోని సత్యదేవ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, సర్పంచ్ గుడాల శ్రీలత, రాంబాబు, చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, గండే కాశీ, ఎంపీడీవో బడే రాజేశ్వరరావు, తహసీల్దార్ చిరంజీవి ఉన్నారు.

నారా లోకేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం కాకినాడ నగరంలో నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. పెద్ద మార్కెట్ ఏరియాలో ఫౌండేషన్ కార్యాలయంవద్ద వంద రోజుల పాలన కేక్ కట్ చేసి పంచారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు అధ్యక్షత వహించగా, ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాం వర్మ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు చౌదరి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క సుదర్శన్‌రావు పాల్గొన్నారు. ప్రత్తిపాడు ఫౌండేషన్ అధ్యక్షుడు అడపా జగదీష్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు భోజన వసతి కల్పించారు.

కాకినాడలో..

సంక్షోభంలోను సంక్షేమం విస్మరించకుండా అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా ప్రజల్లో ఆదరణ పొందిందని 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేస్తూ 'ఇది మంచి ప్రభుత్వం' అనే స్టిక్కర్లను గోడకు అతికించారు. టీడీపీ డివిజన్ మహిళా నాయకురాళ్లు నల్లూరి తులసి, పెమ్మాడ సాయి ప్రసన్న, బీజేపీ మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, జనసేన నాయకురాలు హైమావతి పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట, సెప్టెంబరు 20: ఉండూరులో ఇంటింటా ఇది మంచి ప్రభుత్వం పేరిట కరపత్రాలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఎంపీడీవో డి. శ్రీలలిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి టి.సత్యనారాయణ, సర్పంచ్ సత్యాధి ధనలక్ష్మి, ముసలిబుజ్జమ్మ, కొప్పిరెడ్డి రాజా పాల్గొన్నారు. హుస్సేన్‌పురంలో కరపత్రాలను ఇంటింటా అందజేశారు.

కాకినాడ రూరల్‌లో..

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 20: మేము పాలకులం కాదు.. ప్రజా సేవకులం .నిరంతరం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి నాయకులం సమిష్టిగా పనిచేస్తామని కూటమి నాయకులు తెలిపారు. నేమాంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూరిలతో కలిసి పాల్గొన్నారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకులు దాసరి శివ, పోసిన రాము, కటకంశెట్టి బాబీ, వి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, ఎంపీడీవో కర్రె స్వప్న పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 20: వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో చేసిన మంచిని గుర్తించాలని టీడీపీ.జనసేన నేతలు కోరారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చేబ్రోలు తదితర గ్రామాల్లో శుక్రవారం మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. చేబ్రోలులో ఉలవకాయల దేవేంద్రుడు, ఒరుగంటి వీరబాబు, దూళ్ల లచ్చబాబు, ఉలవకాయల సత్యనారాయణ, ఇందన జయకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తాటిపర్తిలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి సన్యాసిరావు పాల్గొన్నారు.

కరపలో..

కరప, సెప్టెంబరు 20: కరపలో ఎంపీడీవో కొంకి అప్పారావు వలసపాకల, కరప గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కరపత్రాలు అందించారు.

స్థలాలు పరిశీలించిన నిజనిర్ధారణ కమిటీ

తుని రూరల్, సెప్టెంబరు 20: తుని రాజుపేటలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సేకరించిన భూముల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కూడిన నిజనిర్ధారణ కమిటీ శుక్రవారం రాజుపేట లేఅవుట్‌లో స్థలాలను పరిశీలించింది. టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, దూలం మాణిక్యం, వంగలపూడి నాగేశ్వరరావు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనం సీజ్

తుని రూరల్, సెప్టెంబరు 20: మండలంలో పోలవరం గట్ల వెంబడి గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లతోపాటు ఎక్స్‌కవేటర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగించి అపరాధ రుసుము విధించనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ వివరించారు.

బీసీ రిజర్వేషన్ల తీర్మానంపట్ల కృతజ్ఞతలు

కొత్తపల్లి, సెప్టెంబరు 20: బీసీలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చేస్తూ కేబినెట్‌లో తీర్మానం చేయడంపట్ల సీఎం చంద్రబాబుకు బీసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు టీడీపీతో మంచి జరుగుతుందన్న విషయం రుజువైందని వారు హర్షం తెలియజేశారు. బీసీ నాయకులు వాసంశెట్టి శ్రీనివాసరావు, కుక్కల రామకృష్ణ, గుత్తిర్తి త్రిమూర్తులు, పిచ్చుక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 20: దుమ్ములపేట 10వ వార్డులోని పెద్దఅమ్మోరు ప్రాంతంలో 500 గజాల ఖాళీ స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేశారు. కూటమి ప్రభుత్వంలో ఆ స్థలంపై ఫిర్యాదులు అందడంతో శుక్రవారం టౌన్ ప్లానింగ్ డీసీపీ కె.హరిదాస్ ఆధ్వర్యంలో ఏసీబీ నాగశాస్త్రులు టీపీఎస్ రామ్మోహన్, ఇతర సిబ్బంది అక్కడకు వెళ్లి కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన కాంపౌండ్ వాల్ తొలగించారు.

ఎంహెచ్‌ఓకు క్లాప్ డ్రైవర్ల వినతి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 20: నగర పాలక సంస్థ పరిధిలోని క్లాప్ వాహనాలు నడిపించాలని డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో క్లాప్ వాహన డ్రైవర్లు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. క్లాప్ వాహన డ్రైవర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబు, సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, నాయకులు సంతోష్, విక్టర్, ఇస్మాయిల్, భద్ర ఉన్నారు.

స్వచ్ఛతాహి సేవ పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ రూరల్, సెప్టెంబరు 20: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వాకాడ వెంకటరమణ రూపొందించిన స్వచ్ఛతాహి సేవ పోస్టర్‌ను ఆయన నివాసం వద్ద ఆవిష్కరించారు. ఎస్ఎస్ఏ సీఎంవో సీహెచ్ నాగేశ్వరరావు, సభ్యులు సందీప్, కామేష్, రాజు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో డెంటల్ సర్జరీలు

జగ్గంపేట, సెప్టెంబరు 20: జగ్గంపేట సీహెచ్‌సీలో డెంటల్ సర్జరీ చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రణీత తెలిపారు. ఆమె నేతృత్వంలో డాక్టర్ ఎస్.శంకరావు శుక్రవారం రెండు శస్త్రచికిత్సలు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖర్చుతో కూడుకున్న శస్త్రచికిత్సలు ఇక్కడ ఉచితంగా జరగడంవల్ల బాధితులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిల్లంగి-వేలంక రహదారి పరిశీలన

కిర్లంపూడి, సెప్టెంబర్ 20: చిల్లంగి నుంచి వేలంక రోడ్డు అధ్వానంగా మారడంతో గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. శుక్రవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆ రోడ్డును పరిశీలించారు. రోడ్లపై గుంతలు పూడుస్తామని, ఎమ్మెల్యే జ్యోతుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. జనసేన మండల అధ్యక్షుడు ఉలిసి అయిరాజు, కాయల మణికంఠ, చిట్నీడి సురేంద్ర ఉన్నారు.

వైద్యవిద్య ప్రైవేటీకరణను విరమించుకోవాలి: ఎస్ఎఫ్ఐ

పిఠాపురం, సెప్టెంబరు 20: వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సిద్దు, జి.చిన్ని, బాబీ, వెంకటేష్ పాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు'

రౌతులపూడి, సెప్టెంబరు 20: మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణ తగదని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల రద్దు హామీ ఏమైందని జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు పి.వరహాలు ప్రశ్నించారు. ఈ మేరకు తహశీల్దార్‌సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

సామర్లకోట, సెప్టెంబరు 20: సామర్లకోట రైల్వేస్టేషన్ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైల్వే కార్మికులు, సిబ్బంది స్టేషన్ ఆవరణలో ఉన్న నీటి వనరులను శుభ్రపరిచారు. రైల్వేఅధికారులు బి.శివప్రసాద్, రవికాంత్, రామసుబ్బారావు, సంజీవ్ కుమార్, కెవీ.గిరి, కళ్యాణి, చైతన్య, లోవరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి'

సామర్లకోట, సెప్టెంబరు 20: ప్రతిఇంటా చెత్తను సరైన పద్ధతిలో విభజించి పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

'ఆధునికీకరణతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం'


బియ్యం అందజేస్తున్న టీడీపీ, జనసేన నేతలు వర్మ, మర్రెడ్డి

గొల్లప్రోలు, సెప్టెంబరు 20: ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణతో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయని, అందరి కష్టాలు తీరతాయని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఏలేరు, భారీవర్షాలకు నష్టపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు 50కిలోల వంతున బియ్యాన్ని గొల్లప్రోలు చేనేత సొసైటీవద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఇతర కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిపై సమీక్షించి ప్రజలకు తక్షణం సహాయం అందేలా చొరవ తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నేతలు కదారి తమ్మయ్యనాయుడు, గుండ్ర సుబ్బారావు, శీరం మాణిక్యం, గుళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

'రాజ్యాంగ హక్కుల్ని కాపాడి రాజ్యాధికారం చేపడతాం'

తొండంగి, సెప్టెంబరు 20: రాజ్యాంగ హక్కుల్ని కాపాడి రాజ్యాధికారం చేపట్టేందుకు త్వరలో కొత్త పార్టీని పెట్టబోతున్నట్లు మాజీ ఎంపీ హర్షకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తొండంగి మండలం కోదాడలో జరిగిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సులో మాట్లాడారు. ఎన్నో పార్టీలు ఎస్సీలను ఉపయోగించుకున్నా ఒక్క పార్టీ కూడా వర్గీకరణకు వ్యతిరేకంగా తమ గళం విప్పడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తమకంటూ ఒక పార్టీ అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనికోసం తాను పార్టీ పెట్టి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు పిల్లి బాబ్జి, పెయ్యల సూర్యారావు, తంతటి కిరణ్‌కుమార్, బూర్తి సింహాచాలం,కృష్ణ, ఏలియా పాల్గొన్నారు.

ఇంద్రపాలెం ఎస్ఐగా వీరబాబు బాధ్యతల స్వీకరణ



కాకినాడ రూరల్, సెప్టెంబరు 20: కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం ఎస్ఐగా ఎం.వీరబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2014 బ్యాచ్‌కు ఎంపికై నిడమర్రు, జీలుగుమిల్లి, గణపవరం, తణుకు, మొగల్తూరుల్లో ఎస్ఐగా పనిచేశారు. భీమవరం స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.

తిరుమల పవిత్రతను నాశనం చేసిన మూర్ఖుడు జగన్

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 20: తిరుమల పవిత్రతను నాశనం చేసిన మూర్ఖుడు జగన్ అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విమర్శించారు. మండలంలోని ఇర్రిపాక శివాలయంవద్ద ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌కు వెంకటేశ్వరస్వామిపై కనీస భక్తి లేకపోగా టీటీడీ పవిత్రతను అపవిత్రం చేసిన మూర్ఖుడని దుయ్యబట్టారు. ఇర్రిపాక గ్రామ టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నాగబాబు, చల్లా రామ్మూర్తి, అడపా తాతాజీ, పోసి బాబు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం: తుమ్మల బాబు


స్కూల్‌గేమ్స్ క్రీడలను ప్రారంభిస్తున్న తుమ్మల బాబు

సామర్లకోట, సెప్టెంబరు 20: మానసిక ఉల్లాసానికి ప్రతి విద్యార్థికి క్రీడలు దోహదపడతాయని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు అన్నారు. సామర్లకోట పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపికకు క్రీడా పోటీల శిబిరాన్ని నిర్వహించగా ఆయన ప్రారంభించారు. సామర్లకోట ఎంఈవోల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ క్రీడాకారుల ఎంపిక శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులైన ఎంఈవోలు, పీఈటీల మధ్య సమన్వయం లేకపోవడంతో క్రీడాకారుల ఎంపిక శిబిరానికి ఆశించిన స్థాయిలో స్పందన కానరాలేదు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు భోజనాలు అందలేనట్లు ఫిర్యాదులందాయి. మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో మొక్కుబడిగా క్రీడలు ముగించేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ, ఎంపీపీ సత్తిబాబు తదితర తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి'

గండేపల్లి, సెప్టెంబరు 20: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. గండేపల్లి మండలం మురారి హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి బాలికల సెలక్షన్స్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీల్లో ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల కోఆర్డినేటర్ ఎస్.నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ మెంబర్ ఎస్.శ్రీనివాస్, హెచ్ఎం అమ్మాజీ, సర్పంచ్ కుక్కల ఆనందబాబు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 20: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండల స్థాయి క్రీడా ఎంపికలు, పోటీలు ప్రారంభమయ్యాయి. 14 నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ చల్లా ఆంజనేయులు, వైస్‌చైర్మన్ బత్తుల లక్ష్మీశ్రీను, హెచ్ఎం సీహెచ్ ప్రకాష్, పీడీలు సుబ్బలక్ష్మీ, లంకా రవి, శ్రీహరి, వరహాలు పాల్గొన్నారు.

'క్రీడల్లో ఉన్నతస్థాయికి ఎదగాలి'

తాళ్లరేవు, సెప్టెంబరు 20: బాలికలు చదువుతోపాటు క్రీడల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. చొల్లంగిపేటలో శుక్రవారం మండలస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఎంఈవోలు మంగాయమ్మ, ఉమా, టీడీపీ నేతలు త్రిమూర్తులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు స్కూల్ గేమ్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కరప, సెప్టెంబరు 20: కరప మండలం గొర్రిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని ఎస్‌జీఎఫ్ మండల కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ క్రీడలకు బాలబాలికలను వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని చెప్పారు. గొర్రిపూడి హైస్కూల్ హెచ్ఎం అడబాల కాశీవిశ్వనాథ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సువర్చలాదేవి సెలక్టర్లుగా వ్యవహరిస్తారన్నారు.

శ్రమదానం చేసి గ్రోయిన్ పూడ్చిన రైతులు


గ్రోయిన్ పూడుస్తున్న రైతు కూలీలు

తుని రూరల్, సెప్టెంబరు 20: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకుండా మేము సైతం అంటూ శ్రమదానానికి దిగారు డి.పోలవరం రైతులు. బ్రిటీష్ కాలం నాటి గ్రోయిన్‌ను పూడ్చేందుకు అక్కడ రైతులు చేతులు కలిపారు. గ్రామంలో తాండవ నదీతీరాన ఉన్న గ్రోయిన్ ఇటీవల వర్షాలకు నది ఉధృతంగా ప్రవహించడంతో గ్రోయిన్ కాస్త కోతకు గురైంది. దీంతో రైతులు 1200 ఎకరాల వరి పంట నీట మునిగింది. పంటను కాపాడుకునేందుకు గ్రోయింగ్ పూడ్చాలని సంకల్పించారు. గ్రోయిన్ దిగువ రైతు కూలీలు శ్రమదానం చేసి కోతకు గురైన గ్రోయిన్ పూడ్చివేశారు.

సూరన్న కట్టు బాగుచేసుకున్న రైతులు

కోటనందూరు, సెప్టెంబరు 20: కోటనందూరు మండలం తాటిపాక తాండవనది చెంత ఉన్న సూరన్న కట్టు ఇటీవల వర్షాలకు దెబ్బతింది. దీంతో రైతులకు సాగునీరు అందడం కష్టంగా ఉండడంతో రైతులు డి.పోలవరం సర్పంచ్ పలక సోమేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రమదానం చేసి కట్టును బాగు చేసుకున్నారు. ఇసుక బస్తాలు వేసి నీరు పొలాలకు అందేలా చేసుకున్నారు.

'జూనియర్ కళాశాలలో వసతులు కల్పించాలి'

జగ్గంపేట, సెప్టెంబరు 20: రాజపూడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ విజృంభణ డిమాండ్ చేసింది. కళాశాలవద్ద శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నాచేశారు. నాయకులు శ్రీకాంత్, సతీష్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వృద్ధురాలి మృతి

సామర్లకోట, సెప్టెంబరు 13: సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రెండో నెంబరు ప్లాట్‌ఫాం శివారున వేగంగా వెళ్తున్న రైలునుంచి జారిపడి గుర్తు తెలియని 55ఏళ్ల వయస్సుగల వృద్ధురాలు శుక్రవారం తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ బి.కిషోర్ సామర్లకోట రైల్వే పోలీసులకు అందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలు మృతికి దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు నిర్వహించారు. రైళ్లల్లో యాచన చేసుకునే వృద్ధురాలిగా రైల్వేపోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ బి.లోవరాజు శుక్రవారం రాత్రి తెలిపారు.

జైగణేష్ ఆలయంలో హుండీల లెక్కింపు

పిఠాపురం, సెప్టెంబరు 20: పిఠాపురం పట్టణంలోని కోట గుమ్మం సెంటర్ వద్ద ఉన్న జైగణేష్ దేవస్థానంలో శుక్రవారం హుండీల లెక్కింపు చేపట్టారు. ఏడాది కాలానికి గాను హుండీల ద్వారా రూ.2,79,050 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారులు వి.ఫణీంద్ర, ఆలయ ఈవో నున్న శ్రీరాములు పాల్గొన్నారు.

గాలిగంగాలమ్మ జాతర ప్రారంభం

పిఠాపురం, సెప్టెంబరు 20: పట్టణంలోని గాలిగంగాలమ్మ తల్లి జాతర శుక్రవారం ప్రారంభమైంది. 15రోజులు పాటు జరిగే అమ్మవారి జాతరను 150ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని మునిసిపల్ కౌన్సిలర్ తల్లిశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలరు రెడ్డెం భాస్కరరావు, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం మాజీ చైర్మన్ రెడ్డెం జనార్థన్, రమేష్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు ప్రారంభించారు. ఆటోయూనియన్ అధ్యక్షుడు దవులూరి రాంబాబు, లచ్చబాబు, మేకల పద్మారావు, బండి రాఘవ పాల్గొన్నారు.

5న కాకినాడలో పారిశుధ్య కార్మికుల సభ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 20: పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా పోరాడాలని ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు సూచించారు. ఏఐఎఫ్‌టీయూ అనుబంధ పారిశుధ్య కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబరు 5న కాకినాడ గాంధీభవన్‌లో నిర్వహించే సభ పోస్టర్లను గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు.